క్లుప్తంగా

అశ్వారావుపేటలో వర్షం

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి అకాల వర్షం కురిసింది. గడిచిన కొద్ది రోజులుగా అధిక ఎండలతో రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి, మినుము, వేరుశెనగ పంటలు ఎండి పోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో రైతులు పంటలకు సాగు నీరు అందించేందుకు నానా అవస్థలు పడుతున్న తరుణంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి దాదాపు రెండు గంటలపాటు జోరుగా వర్షం కురిసింది. దీంతో ఎండిపోతున్న పంటలకు వర్షం ప్రాణం పోసినట్టైంది.

వైద్యశిబిరం

ములకలపల్లి: మండలపరిధిలోని రాచన్నగూడెం గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ, కిన్నెరసాని ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ కె.సత్యనారాయణరాజు 78 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ కొర్సా గణపతి, క్లబ్ అధ్యక్షుడు రాయల కేథారేశ్వరరావు, సభ్యులు చిట్లూరి జగన్, కుంజా జగన్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



మణుగూరుటౌన్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: మండల పరిధిలోని రామానుజవరం పంచాయతీలోని కొత్త మల్లేపల్లి గ్రామంలోని 50 కుటుంబాలు ఆదివారం మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరాయి. పాయం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చినప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేవిరావు, ఏఎంసీ డైరెక్టర్ గుండగాని వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ వీరంకి వెంకట్రావ్ గౌడ్, ఎంకెఎం రాజు, సామా శ్రీనివాసరెడ్డి, బల్లెం సురేశ్, హరి శంకర్, కట్ట నర్సింహ, తమ్మిశెట్టి సాంబ, కటుకూరి శ్రీనివాసరావు, తోటకూరి సాంబ, పానగంటి రవి, కర్రీ సాయి కుమార్, కట్ట రవిబాబు, డేగల మహేశ్, డేగల కృష్ణారావు, కట్ట ప్రసాద్, కిరణ్, మామిడి తరుణ్, నిట్టా పవన్ తదితరులు ఉన్నారు.

చర్ల: మండలంలోని కుదునూరులో శనివారం రాత్రి బీఆర్ఎస్, సీపీఐ పార్టీల నుంచి పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ టీపీసీసీ సభ్యులు, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ నల్లపు దుర్గాప్రసాదరావు, పార్టీ మండల అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సిద్ది వెంకటేశ్వర్లు, మైపా వెంకటేశ్వర్లు, సిద్ది దేవరాజు, డేగల నర్సింహారావు, నిట్టా సుదీర్, రాకేష్, వికాస్, సాయినద్, శ్రీకాంత్, ప్రశాంత్, ఆదినారాయణ, మధు, క్రిష్ణకిశోర్ పాల్గొన్నారు.

రేగా గెలుపే లక్ష్యం

అశ్వాపురం: ఎన్నికల్లో పినపాకలో రేగా గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ అన్నారు. మండల పరిధిలోని ఆనందాపురం గ్రామంలో బూత్ కోఆర్డినేటర్, బూత్ ఇన్‌చార్జ్, వంద ఓటర్ల ఇన్‌చార్జ్‌లతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రేగా హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో అశ్వాపురం జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, యువజన విభాగం మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు కందుల కృష్ణార్జున్‌రావు, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, ఏనుగుల సత్యనారాయణ, నక్కనబోయిన పాపారావు, కొండల్, కదారి శ్రీను, ఇందు, లక్ష్మణ్, మౌనిక, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో ఏళ్ల సంవత్సరాల నుంచి నివసిస్తున్న గిరిజనేతరుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి పూనెం ప్రదీప్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏజన్సీలో గిరిజనులు, గిరిజనేతురులు సోదరభావంతో కలిసి మెలిసి ఉంటుంటే కొందరు ఏజన్సీ చట్టాలను అడ్డు పెట్టుకుని గిరిజనేతరులకు ఈ ప్రాంతంలో హక్కులేదని బేదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగం పేర్కొన్న ఆర్టికల్ 15, 19 ప్రకారం ప్రతి పౌరుడూ భారతదేశంలో ఎక్కడైన స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవించే హక్కు ఉందన్నారు. కొందరు అధికారులు సైతం గిరిజన చట్టాలను సాకుగా చూపి గిరిజనేతరుల నుంచి వసూళ్లకు పాల్పతుడున్నారని, ఇప్పటికై ప్రభుత్వాలు ఏజన్సీలో నివసిస్తున్న గిరిజనేతరులకు సైతం హక్కులను కల్పించే విధంగా చట్టలను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు.

అభివృద్ధి వైపే యువత మొగ్గు!

- సమర్థవంత నాయకత్వానికే ఓటు
- ఉపాధికి ఊతమిచ్చేవారికి ప్రాధాన్యం
- అన్ని వర్గాలను కలుపుకుపోయేవారికి రెడ్‌కార్పెట్
- నూతన ఓటర్ల ఆలోచనా సరళి ఇదీ..



మణుగూరులోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తున్న తహసీల్దార్(ఫైల్)

మణుగూరుటౌన్: భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికే పట్టం కట్టింది. దీని ప్రకారం ప్రజల చేత, ప్రజల కొరకు ప్రభుత్వాలు ఏర్పాటవుతాయి. అందుకోసం ఓటు హక్కును తీసుకొచ్చారు. అది ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంలో సాధారణ ప్రజల చేతిలో ఆయుధంగా పనిచేస్తోంది. ఆ ఆయుధమే ప్రస్తుతం ఎన్నికల్లో నూతనంగా ఓటు హక్కు పొందిన యువత చేతికి రానుంది. ఈ నేపథ్యంలో పినపాక నియోజకవర్గంలో యువ ఓటర్ల మనోగతాన్ని 'సాక్షి'పరిశోధించే ప్రయత్నం చేసింది.

పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాలు కలిపి 18–19 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు మొత్తం 5,181 మది ఉన్నారు. ఇంత స్థాయిలో నూతనంగా ఓటర్ల సంఖ్య ఉండడంతో వీరి ఓట్లే ఈ సారి కీలకంగా మారనున్నాయి. అభ్యర్థి గెలుపోటములను నిర్ణయించడంతో కీలక భూమిక పోషించనున్నాయి. అయితే, వారు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో ఏయే అంశాలను పరిగణలోకి తీసుకుని ఓటుకు మొగ్గుచూపుతున్నారో అన్నది ఇప్పుడున్న ప్రశ్న. రెవెన్యూ అధికారులు ముమ్మర అవగాహన కార్యక్రమాలతో చాలా మంది యువత సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేసే పాలనకే నూరు మార్కులేస్తున్నారు. ఆ మేరకు సమర్థవంతమైన నాయకులనే అన్వేషిస్తున్నారు. ప్రలోభాలకు తలొగ్గి ఓటేస్తే భవిష్యత్ అంధకారమవుతుందనే అవగాహనతో ఉన్నారు. వారి మనోగతాన్ని వారి మాటల్లోనే చదవండి.

ఓటు.. మార్పునకు నాంది



ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు సామాన్య ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకునే నాయకుడికి ఓటు వేస్తాం. కొత్త ఓటర్లు బాగా ఆలోచించి ఓటు వేయాలి. సమాజాభివృద్ధికి పాటుపడే నాయకుడిని ఎన్నుకోవాలి. ముఖ్యంగా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే పథకాలు ప్రవేశపెట్టే ప్రభుత్వాలకు పట్టం కట్టాలి.

– సృజన, ఏడూళ్లబయ్యారం, పినపాక

అభివృద్ధి చేసే వారికే ఓటు



కొన్ని ప్రభుత్వాలు ఉచిత హామీలకు, అభివృద్ధి కాగితాలకే పరిమితం చేస్తున్నాయి. దానిని గుర్తించి అభివృద్ధి చేసే వారికే నా ఓటు వేస్తాను. ప్రలోభాలకు లొంగకుండా ఓటు వినియోగించుకుంటాను. అవినీతి రూపుమారాలంటే సత్తా ఉన్న పనిచేయగల సమర్థ నాయకుడికే నా తొలి ఓటు వేస్తాను.

– ముక్కు గణేశ్ రెడ్డి, ఏడూళ్లబయ్యారం, పినపాక

విశ్వసనీయతకే ప్రాధాన్యత



యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించే నాయకుడికే తొలి ఓటు వేస్తా. ఎన్నికల్లో గెలుపొందడానికి ఉచిత హామీలు ఇస్తూ, మద్యం, డబ్బుతో ప్రలోభాలకు గురి చేసే వారిని దరి చేరనీయకుండా విశ్వసనీయత ఉన్న నేతకే ఓటు వేస్తాను. ఓటు హక్కు ప్రాధాన్యతను చాటుదాం.

– మోటూరి తేజ, మణుగూరు

భవిష్యత్ కోసం ఓటు



ప్రచార ఆర్భాటాల కోసం ప్రాధాన్యమిచ్చే ప్రభుత్వాల మాయ మాటలు నమ్మి ఓటు వేయను. నా ఓటు బంగారు భవిష్యత్తు కోసం వేస్తాను. రాష్ట్రాన్ని సుభిక్షంగా అభివృద్ధి దిశలో నడిపించే సత్తా కలిగిన నాయకుడికే నా మొదటి ఓటు. కొత్త ఓటర్లు బాగా ఆలోచించి ఓటు వేయాలి.

– గుగులోత్ బిందు, మణుగూరు

ఆత్రుతతో ఉన్నా..



మొదటి సారి ఓటు వేయడానికి చాలా ఆత్రుతగా, సంతోషంగా ఎదురుచూస్తున్నా. అంగన్‌వాడీ టీచర్ల ద్వారా నా చదువుకు సంబధించిన వివరాలు ఇచ్చి ఓటు హక్కును నమోదు చేసుకున్నాను. తప్పక నా ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకుంటా.

– గద్దం సాయి, గుండాల

సరిహద్దు గ్రామాల్లో తనిఖీలు



భద్రాచలంఅర్బన్: బ్రిడ్జి సెంటర్ ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



దమ్మపేట: అల్లిపల్లి చెక్‌పోస్టులో రికార్డులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్

చర్ల: మండల కేంద్రంతో పాటు సరిహద్దు గ్రామాల్లో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. చర్లలో జరిగే వారపు సంతకు సరిహద్దు ప్రాంతంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంతాల నుంచి నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తనిఖీలను నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రానికి వచ్చే ప్రధాన రహదారులైన లైనిన్‌కాలనీ, లక్ష్మీకాలనీ, తాలిపేరు ప్రాజెక్టు, కలివేరు క్రాస్‌రోడ్, ఆర్ కొత్తగూడెం సెంటర్లలో మోహరించిన పోలీసు బలగాలు.. వచ్చిపోయే ఆదివాసీలను తనిఖీ చేశారు. అనుమానితులుగా భావిస్తూ పలువురిని అదుపులోకి తీసుకొని విచారించి విడిచిపెట్టారు.

చెక్‌పోస్టుల వద్ద..

భద్రాచలంఅర్బన్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి డబ్బు, మద్యం అక్రమ తరలింపులు కొనసాగుతుంటాయనే నేపథ్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన నాలుగు చెక్‌పోస్టులు వద్ద పోలీసులు వాహన తనిఖీలు పకడ్బందీగా చేపడుతున్నారు. ఆదివారం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద టౌన్ సీఐ నాగరాజు రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనిఖీలలో పాల్గొంటున్న పట్టణ పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేయాలని, ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే వదిలి పెట్టాలని సూచించారు. ఇదిలా ఉండగా ప్రైవేట్ ట్రావెల్స్‌కి సంబంధించిన బస్సులను తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.

రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో..

దమ్మపేట: మండల పరిధిలోని పలు చెక్‌పోస్టులను తహసీల్దార్ ఎండి.ముజాహిద్ తనిఖీ చేశారు. ఆదివారం మండలంలోని అల్లిపల్లి, మందలపల్లి, గణేష్‌పాడు చెక్‌పోస్టులను ఎన్నికల విధుల్లో భాగంగా సందర్శించిన తహసీల్దార్.. రికార్డులను తనిఖీ చేశారు. చెక్‌పోస్టు సిబ్బంది ప్రతి నిమిషం అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా ఆపి, చెక్ చేయాలని సూచించారు.

తెల్లం గెలుపుతోనే అభివృద్ధి



దుమ్ముగూడెం: బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ తాతా మధు, తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు గెలుపు అభివృద్ధికి మలుపు అని ఎమ్మెల్సీ, భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ తాతా మధు అన్నారు. ఆదివారం మండలంలోని బండిరేవు గ్రామంలో మండల యూత్ సమావేశంలో ముఖ్య అతిథులుగా తాతా మధు సుధన్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన 150 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... డాక్టర్ తెల్లం వెంకట్రావును అత్యధిక మెజారిటీతో గెలిపించి నియోజకర్గ అభివృద్ధిలో భాగాస్వాములు కావాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ,మండల ప్రధాన కార్యదర్శి కణితి రాముడు,నాయకులు తునీకి కామేశ్వరరావు,అల్లాడి వెంకటేష్, జిలకర గంగరాజు, జోగ వెంకటరమణ, కొత్తూరు సీతారామారావు,కణితి లక్ష్మణుడు, సాయం నర్సింహారావు, తోట రమేష్ , జుంజురి జయసింహ,కల్లూరి ఆదినారాయణ, ఉబ్బ వేణు, మద్ది శ్రీను,ఎంపీటీసీ సొడి తిరుపతిరావు,సర్పంచులు మట్టా వెంకటేశ్వరావు, మడకం నాగేంద్ర బాబు, వర్సా చిన్నారావు,కొమరం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

చర్లరూరల్: రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఎమ్మెల్సీ, భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాతా మధు అన్నారు. చర్ల మండలంలోని రాళ్ళగూడెం గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన సుమారు 80 కుటుంబాలు బీఆర్‌యస్ పార్టీలో చేరాయి. మరోవైపు, బోళ్ల వినోద్ ఆధ్వర్యంలో మరో 50 కుటుంబాలు భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు సమక్షంలో గులాబీ గూటికి చేరాయి. పార్టీ మండల అధ్యక్షుడు సోయం రాజారావు,ప్రధాన కార్యదర్శి పోలిన లంకరాజు, ఎంపీపీ కోదండ రామయ్య, చర్ల సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, ప్రచార కార్యదర్శి కొటేరు శ్రీనివాసరెడ్డి,ఎస్టీ సెల్ అధ్యక్షుడు కాపుల నాగరాజు, ఎంపీటీసీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాబాను దర్శించుకున్న ఎమ్మెల్సీ..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని షిర్డీ బాబావారి ఆలయాన్ని ఎమ్మెల్సీ తాతా మధు ఆదివారం సందర్శించారు. బాబావారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ మధును శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావ్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కొమ్మనాపల్లి ఆదినారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారంలోకి రావడం ఖాయం



మణుగూరురూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరురూరల్: రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని తెలంగాణాభవన్‌లో ఆయన పార్టీ మండల, పట్టణ సోషల్ మీడియా వారియర్స్‌తో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ఎన్నికల ప్రచారానికి సంబంధించి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని, అమలు చేసిన సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. నేటి సమాజంలో సోషల్ మీడియా ఎంతో గొప్ప అస్త్రమని, ప్రచారంలో సోషల్ మీడియాదే కీలక పాత్ర అని తెలిపారు. అనంతరం సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు కర్నె మురళి మాట్లాడారు. 66 బూత్ స్థాయిల్లో సోషల్ మీడియా కమిటీలను ఎంపిక చేశారు. మండల, పట్టణ సమన్వయ కర్తలుగా తాళ్లపల్లి నాగరాజు, బానోత్ పుష్పలత, డేగల సంపత్‌కుమార్, చెలికాని రామకృష్ణలను నియమించారు. కాగా, ముత్యాలమ్మనగర్ గ్రామంలో సర్పంచ్ కొమరం జంపేశ్వరితో కలిసి రేగా కాంతారావు ప్రచారం నిర్వహించారు. సమావేశంలో సోషల్ మీడియా నియోజకవర్గ అధ్యక్షులు యాంపాటి సందీప్ రెడ్డి, యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షులు మట్టపల్లి సాగర్ యాదవ్, నాయకులు మారోజు రమేష్,కాట్రగడ్డ సురేందర్ పటేల్, సోషల్ మీడియా వారియర్లు పాల్గొన్నారు.

సర్వ మతాలకు సముచిత స్థానం

బూర్గంపాడు: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సర్వ మతాలకు సముచిత స్థానం దక్కిందని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. సారపాకలోని కల్వరి మార్గం గ్లోరియస్ చర్చిలో ఆదివారం ఆయన ప్రత్యేక ప్రార్థలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు, ముస్లింలకు రంజాన్ తోఫా, ఆహారభద్రత కార్డులు ఉన్న అందరికీ బతుకమ్మ చీరెలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, కరుణ, సహనం అనే దయా గుణాలను క్రీస్తు తన బోధనలతో ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ విప్ కాంతారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిక..

మండల పరిధిలోని మోరంపల్లిబంజర, పినపాక పట్టీనగర్ గ్రామాలకు చెందిన 80 కుటుంబాలు ఆదివారం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరాయి. వారికి ప్రభుత్వ విప్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత,సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్ పాల్గొన్నారు.

అసోసియేషన్ ఎన్నిక

దమ్మపేట: మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామంలో ఎన్నిక జరగగా అధ్యక్షుడిగా నల్లపు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా కుంపటి సత్యం, కోశాధికారిగా గండికోట వేణులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంలంలోని చిల్లగుంపు గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ చనుబోయిన పెంటయ్య ఇటీవలే జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. రూ.10 వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో వేముల నరసింహారావు, మారుతి ప్రకాష్, కీసర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా గంగరాజు

అశ్వాపురం: బీసీ సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షుడుగా మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన అండెం గంగరాజుగౌడ్‌ను నియమించారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మహంకాళి రామారావు గంగరాజుకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జంకి కనకాచారి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిదానపల్లి బాలకృష్ణ, మండల అధ్యక్షుడు సాంబ, మహిళ అధ్యక్షురాలు అనిత, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

భవిష్యత్‌కు పాటుపడదాం

మణుగూరురూరల్: ఆదివాసీల మనుగడ, భవితవ్యం కోసం ప్రతీ ఒక్కరం పాటుపడదామని ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ దాట్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని తోగ్గూడెం సమ్మక్క–సారలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివాసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హజరైన ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే ఎన్నికలు ఆదివాసీలకు అత్యంత కీలకమని అన్నారు. జేఏసీ జిల్లా చైర్మన్ వాగబోయిన చంద్రయ్య, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు సనప కోటేశ్వరావు, ఆదివాసీ సేన రాష్ట్ర నాయకులు కొమరం అనిల్‌కుమార్, వజ్జా జ్యోతిబసు, నాయకులు ఇర్పా వెంకటేశ్వర్లు, కోడి నాగరాజు, సోడే రవికుమార్, కలం సాంబశివరావు, ముత్తయ్య, నాగరాజు, కోటి, నరేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

ముమ్మరంగా పార్టీల ప్రచారం



చర్ల: భూముల్లంకలో ఆరు గ్యారెంటీలను వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మణుగూరురూరల్: ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

మణుగూరురూరల్: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పినపాక నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీ గ్రామాల్లో, ఓటీ కంపెనీల్లో పార్టీ నాయకులు బీఆర్ఎస్ మేనిఫెస్టోల కరపత్రాలను పంపిణీ చేస్తూ పథకాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాలు అమలు చేసిందని, అభివృద్ధి చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు, అరోపణలు చేస్తున్నాయన్నారు. రాష్ట్రం బంగారు తెలంగాణ కావాలన్నా, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలన్న బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా రేగా కాంతారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలను, కార్మికులకు కోరారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, ఎంపీపీ కారం విజయకుమారి, బీఆర్ఎస్ నాయకులు ముత్యంబాబు, రామిడి రామిరెడ్డి, అప్పారావు, ఎడ్ల శ్రీనివాస్, యాదగిరిగౌడ్, బుద్ద రాజు నవీన్‌బాబు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

చర్ల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే ఆరు పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం మండలంలోని దండుపేటకాలనీ, భూముల్లంక, విజయకాలనీ, లక్ష్మీకాలనీ, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చీమకుర్తి వీరభద్రం, చీమలమర్రి మురళీకృష్ణ నేతృత్వంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత పథకాలపై ప్రజలకు వివరిస్తూ పదేళ్ల పాటు రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

చి'వరి' తడికి సంకటం

- ఇంకిపోయిన చెరువు..
- పొట్టదశలో వరి చేలు
- నీళ్లు తగ్గడంతో స్థానికుల చేపల వేట



అడుగంటిన చీమలగూడెం ఊరచెరువు



ఇంకిపోయిన చెరువులో చేపలు పడుతున్న గిరిజనులు

గుండాల: మండుటెండల్లో చెరువులు ఎండిపోతాయి.. గండిపడి నీళ్లు పోతాయి.. కానీ ఇక్కడ ఆ రెండూ లేకుండానే ప్రతి ఏటా చెరువులో నీళ్లు అడుగంటుతున్నాయి. వరి చేను పొట్టదశలో ఉన్నప్పుడు చివరి తడి అందకుండానే నీరు చేజారిపోతోంది. చేన్లన్ని ఎండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని చీమలగూడెంలో ఈ పరిస్థితి నెలకొంది.

చీమలగూడెం గ్రామానికి చెందిన ఊర చెరువు వర్షాకాలం రాగేనే నిండుతుంది. ఈ చెరవు కింద సుమారు 300ల ఎకరాల వరకు వరి సాగవుతుంది. గత కొన్నేళ్లుగా వరి చేన్లు పొట్టదశకు వచ్చే క్రమంలోనే చెరువులో నీళ్లన్ని ఇంకిపోతున్నాయి. కారణం తెలియని ఈ సమస్యతో చివరి తడి కోసం ఆ రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. అక్కడక్కడ ఉన్న గుంటల్లో నీళ్లను ఆయిల్ ఇంజన్ల సాయంతో పైపుల ద్వారా తూములకు నీళ్లందిస్తున్నారు. మరో పక్క మల్లన్న వాగు నుంచి మోటార్లతో నీళ్లందిస్తున్నారు. అయినా సకాలంలో, పూర్తిస్థాయిలో పంటలకు నీళ్లు అందడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి వేసిన పోలాల్లో ఒక్కో ఎకరానికి రూ.10వేల నుంచి, రూ.20 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు ఆశించిన రీతిలో దిగుబడులు రాకుండా ఆ పెట్టుబడి అంతా నష్టమే. కాగా, చెరువులో నీరు ఇంకపోవడంతో ఉన్న కొద్దిపాటి నీళ్లలో స్థానికులు చేపలవేట సాగిస్తున్నారు. సాధారణంగా ప్రతిచోట ఎండాకాలంలో కనిపించే చేపల వేటలు ఇక్కడ మాత్రం నీరు లేక ఈ కాలంలోనే కనిపిస్తోంది.

దృష్టి సారించాల్సిన అంశాలివే..

2010లో ఉపాధి హామీ పథకంలో కట్టపైపోత, అలుగు నిర్మాణ పనులు చేపట్టారు. గత ఏడాది మిషన్ కాకతీయ కింద కూడా ఈ పనులకు రూ.40 లక్షలు కేటాయించారు. కాని అలుగు పనులు పూర్తి కాలేదు. పనులు మధ్యలోనే వదిలేశారు. అలుగు పూర్తిస్థాయిలో నిర్మాణమైతే నీరు నిలువడానికి కొంతమేర అవకాశం ఉంటుంది. దీంతోపాటు మామిడి తోగు వాగు నుంచి నీరు చెరువుకు చేరేందుకు ఇప్పటికే పైప్‌లైన్ ఉంది. కానీ అది మరమ్మతులకు గురైంది. పైపులైన్ అక్కడక్కడ లీకై నీళ్లు వృథాగా పోతున్నాయి. ఇక మధ్యలో నిర్మించిన చెక్ డ్యాం సైతం మరమ్మతులకు గురైంది. ఈ రెండిటి మరమ్మతులపై దృష్టి సారిస్తే చెరువులో నీరు ఉంటుంది. వీటి పరిష్కారం కోసం స్థానికులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు వేడుకుంటున్నారు.

ప్రతి ఏటా విన్నవిస్తూనే ఉన్నాం..



మా సమస్యను పరిష్కరించాలని ప్రతీ సంవత్సరం అధికారులను అడుగుతూనే ఉన్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. వరి సాగు చేయడం, నీళ్లు లేక చేన్లన్ని ఎండిపోవడం పరిపాటి అయింది.

– కల్తీ నాగేశ్వరరావు, రైతు

రూ.లక్షలు పెట్టినా ఉపయోగం లేదు



మిషన్‌కాకతీయ పథకం కింద రూ.40 లక్షలతో చెరువు పనులు చేపట్టినా ఫలితం లేదు. ఒక్క పంటకు కూడా నీళ్లందని పరిస్థితి. ఈ విషయాన్ని అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా వారు పట్టించుకోవడం లేదు.

– ప్రసాద్, రైతు